ప్రజా విశ్వంభర V3 NEWS

# రాహుల్ గాంధీనే ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి

○ కేసీ వేణుగోపాల్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** కొద్ది రోజులుగా ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థికి సంబంధించి పలు ఊహాగానాలు వస్తున్న వేళ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీనే నాయకత్వం వహిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రోజు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కేసీ వేణుగోపాల్ ఇలా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో టీవీకే పార్టీ తమ నాయకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి సి. విజయ్ జోసెఫ్‌ను ఇండియా కూటమి తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదించిందన్న వార్తలను వేణుగోపాల్ ఖండించారు. విజయ్ గురించి ప్రస్తావిస్తూ విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆ కథనాల్లో నిజం లేదని, టీవీకే అలాంటి డిమాండ్ ఏం చేయలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎవరూ ఇలాంటి గందరగోళ పరిస్థితుల్ని సృష్టించవద్దని, ఇండియా కూటమి ముఖచిత్రంగా రాహుల్ గాంధీనే ఉంటారని వెల్లడించారు.

**రాహుల్ కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోంది!..**

రైతులు, యువత, విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న రాజకీయ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా కూడా విశేష ఆదరణ లభిస్తోందని కేసీ వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులు, రైతులు, యువత ఇలా ఏదైనా ఆయన నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల గురించే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎక్కువగా చర్చ జరుగుతోందని ప్రశంసలు కురిపించారు. అయితే రాహుల్ గాంధీనే ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తారా అని విలేకరులు మరోసారి ప్రశ్నించగా కచ్చితంగా అంటూ వేణుగోపాల్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం భారతీయులు అత్యధికంగా ఆదరించే ప్రముఖ నాయకుల్లో రాహుల్ గాంధీనే ముందు వరుసలో ఉంటారని, ఆయన తీసుకునే నిర్ణయాలను, చేసే పనులను ప్రజలంతా ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో తమ భాగస్వామ్య పక్షాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, ఇండియా కూటమి మాత్రం ఇప్పటికీ బలంగానే ఉందని చెప్పుకొచ్చారు.

**బీజేపీ సర్కార్ చీకటి యుగంవైపు నడిపిస్తోంది!..**

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై కేసీ వేణుగోపాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశాన్ని చీకటి యుగం వైపు తీసుకెళ్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర జరిగిన విద్యార్థుల శాంతియుత నిరసన, తర్వాత పోలీసుల అణచివేత చర్యల గురించి కూడా వేణుగోపాల్ ప్రస్తావించారు.విద్యార్థులపై నిరసనల సమయంలో పోలీసు బలగాలు తీసుకున్న కఠిన చర్యల్ని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సమర్థించుకుంటూనే ఉందని మండిపడ్డారు. మరోవైపు ఉత్తరాఖండ్ హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభ నిర్వహించిన వేదికను, ఆయన ప్రసంగం అనంతరం శుద్ధి చేసిన ఉదంతాన్ని కూడా ఈ సందర్భంగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ గుర్తుచేశారు. భారతదేశం అంధకారం వైపు పయనిస్తోందని చెప్పడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి దేశంలో ఒక బలమైన పోరాటం జరగడం అత్యవసరమని, తాము కూడా అదే కోరుకుంటున్నామని వ్యాఖ్యానించారు. కాగా, 2014 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమే కేంద్రంలో అధికారంలో ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే వరుసగా 3 సార్లు (2014, 2019, 2024) లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 2029లో తదుపరి ఎన్నికలు జరగనున్నాయి.



## మహిళా సంఘం భవనానికి ఘనంగా ద్వారపూజ

**విశ్వంభర, గుండాల :** బండకొత్తపల్లి గ్రామంలోని వాళ్ళు వి ఓ భవన సముదాయంలో నిర్మిస్తున్న మహిళా సంఘం భవనానికి నూతన ద్వారం ఏర్పాటు సందర్భంగా మహిళా సంఘం సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ద్వారానికి సంప్రదాయబద్ధంగా ద్వారపూజ చేసి, మహిళా సంఘం భవనం త్వరగా పూర్తికావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్, ఉపసర్పంచ్ గోపాలదాస్ యాదగిరి హాజరై మహిళా సంఘం నాయకులు, సభ్యులను అభినందించారు. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు గ్రామ పంచాయతీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. మహిళా సంఘం భవనం పూర్తయితే సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు మరింత అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ భరోసా



**విశ్వంభర. గుండాల :** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకుంది. గుండాల మండలంలోని పెద్దపడిశాల, బ్రాహ్మణపల్లి, కొమ్మాయిపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ పరామర్శించి, బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.5,016 చొప్పున మొత్తం రూ.15,048 ఆర్థిక సహాయం అందజేశారు.పెద్దపడిశాల గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన భాషెట్టి ఎల్లయ్య కుటుంబాన్ని మబ్బు మహేష్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితులను తెలుసుకుని ఫౌండేషన్ తరపున రూ.5,016 ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మానవత్వమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మందుల యాదయ్య కుటుంబాన్ని మబ్బు మహేష్ పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ తరపున రూ.5,016 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి భరోసా కల్పించడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు.కొమ్మాయిపల్లి గ్రామంలో గుండెపోటుతో అకాల మరణం చెందిన తాండ్ర యాకమ్మ కుటుంబాన్ని మబ్బు మహేష్ పరామర్శించారు. విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5,016 ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు వారికి తనవంతు సహాయం అందించడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

## జేఎన్‌యూ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు..!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఓ ప్రొఫెసర్ తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని..యూనివర్సిటీకి చెందిన 10మంది విద్యార్థినులు నెల రోజుల క్రితం యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. క్యాంపస్‌లోని ఆయన నివాసంలో జరిగే సమావేశాలకు ఆహ్వానించి.. ఎవరూ లేని సమయంలో తమతో అసభ్యకరంగా ప్రవర్తించేవారని పేర్కొన్నారు. తరగతుల సమయంలో కూడా అసభ్యకరంగా మాట్లాడుతుంటారని తెలిపారు. తాము కూడా సదరు ప్రొఫెసర్‌తో అటువంటి సమస్యలే ఎదుర్కొన్నట్లు పలువురు సీనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినుల ఆరోపణలపై విశ్వవిద్యాలయం అంతర్గత ఫిర్యాదుల కమిటీ దర్యాప్తు చేపట్టింది. అయితే ఈ విషయంపై జేఎన్‌యూ పరిపాలన విభాగం, వైస్‌ఛాన్సలర్ కార్యాలయం ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (GST అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీబిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.

## వార్డు మెంబర్ల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



విశ్వంభర, బోడుప్పల్ : తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం జిల్లా ఇన్చార్జిల ముఖ్య సమావేశం హైదరాబాద్ మల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగవెల్లి జ్యోతి మహేష్ ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా ఇన్చార్జిలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర లీగల్ అడ్వైజర్ గా బోడుప్పల్ టెలిఫోన్ కాలనీ నివాసి గణగాని రమేష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జిల అభిప్రాయాలు, వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ ప్రజాస్వామ్య వ్యవస్థలో వార్డు మెంబర్‌ది అత్యంత కీలకమైన పాత్ర అని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత వార్డు మెంబర్లపై ఉందని నాగవెల్లి జ్యోతి మహేష్ పేర్కొన్నారు.ప్రజాస్వామ్యానికి తొలి పునాది వార్డు మెంబర్. కానీ బాధ్యతలు తప్ప సరైన గౌరవం, గుర్తింపు, గౌరవ వేతనం, ఆరోగ్య భద్రత లేకపోవడం బాధాకరం అని ఆమె అన్నారు.ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులకు వేతనాలతో పాటు ఆరోగ్య బీమా, భద్రత, పెన్షన్ వంటి అనేక సదుపాయాలు ఉన్నాయని, అదే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులైన వార్డు మెంబర్ల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని కేరళ రాష్ట్రంలో వార్డు మెంబర్లకు గౌరవ వేతనం అందిస్తున్న విధానాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకుని మన రాష్ట్రంలోని వార్డు మెంబర్లకు కూడా గౌరవ వేతనంతో పాటు ఆరోగ్య భద్రత, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.

అదేవిధంగా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వార్డు మెంబర్లకు గౌరవ వేతనం, సంక్షేమ సదుపాయాలు అమలు చేస్తేనే పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తున్న వార్డు మెంబర్లకు తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఆమె పేర్కొన్నారు.అలాగే, పదవిలో కొనసాగుతున్న సమయంలో ఒక వార్డు మెంబర్ మరణిస్తే వారి కుటుంబానికి కనీస ఆర్థిక భరోసా, సంక్షేమ పరిరక్షణ లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే వార్డు మెంబర్లకు ప్రమాదం లేదా అనుకోని పరిస్థితుల్లో కుటుంబ భద్రత కల్పించే విధంగా ప్రత్యేక సంక్షేమ విధానం రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వార్డు మెంబర్ల సమస్యలను కేవలం వ్యక్తిగత సమస్యలుగా కాకుండా, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన అంశాలుగా చూడాలని ఆమె సూచించారు. జిల్లా ఇన్చార్జిలు తమ పరిధిలోని ప్రతి మండలాన్ని సందర్శించి వార్డు మెంబర్లను నేరుగా కలవాలని, వారి సమస్యలను తెలుసుకుని వాటిని ఫోరం రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏ వార్డు మెంబర్‌కు సమస్య వచ్చినా తాము అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా వార్డు మెంబర్లను ఒకే వేదికపైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.వార్డు మెంబర్ల సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను నిర్వహించి హక్కులను సాధించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి మహేష్, గౌరవ సలహాదారు మహేష్, రాష్ట్ర లీగల్ అడ్వైజర్స్ గనగాని రమేష్, అందే రవి, రాష్ట్ర ఐటీ అండ్ మీడియా ఇన్చార్జి శ్రీరంగం సాగర్, పాటు 32జిల్లాల ఇన్చార్జిలు పాల్గొన్నారు.

## ఈనెల 10న బీసీల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం



**విశ్వంభర, బషీర్ బాగ్ :** బీసీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించడానికి ఈనెల 10న హైదరాబాదులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశం జరపాలని నిర్ణయించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలు 8వేల కోట్లు వెంటనే చెల్లించాలని, పాత విధానం ప్రకారం ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఫీజుల స్కీము పై ఏర్పడిన గందరగోళం వల్ల 30 వేల మంది ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కు హాజరు కాలేదన్నారు. అలాగే పీజీ అడ్మిషన్ లో ముఖ్యంగా ఎంబీఏ ఎంసీఏ అడ్మిషన్లలో 50% సీట్లు భర్తీ కాలేదని వాపోయారు. కాగా డిగ్రీ కాలేజీలో కూడా 70వేల సీట్లు మిగిలిపోయాయని ఎంపీ కృష్ణయ్య చెప్పారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఎంపీ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లపల్లి అంజి, అనంతయ్య, రాజేందర్, నిఖిల్ పటేల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి, కుంభకోణాలపై అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తాం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమైందని తెలంగాణ బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అనేక అవినీతి, కుంభకోణాలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 33 నెలలైనా అమలు చేయలేదని, ఆరు గ్యారంటీలను నెరవేర్చలేదన్నారు. ప్రజా వ్యతిరేకమైన జీవోలపైనా నిలదీస్తామన్నారు. సభను నడపడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందోన్నారు. అసెంబ్లీ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రభుత్వ, పేదల ఆస్తులను దోచుకుంటున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు, దమనకాండపై అసెంబ్లీలో ప్రశ్నిస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తామని చెప్పారు.

**అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు భాజపా శ్రేణులు అనుమతి అడగడంతో ప్రభుత్వం నిరాకరించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుమతులు ఇవ్వలేదు. దీంతో సోమవారం అసెంబ్లీని ముట్టడించాలని శ్రేణులకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. విద్యార్థులతో ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేపడతామని అనుమతి కోరితే ప్రభుత్వం నిరాకరించిందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు తెలిపారు. విద్యార్థుల పక్షాన శాంతి యుతంగా ధర్నా చేస్తామని చెబితే ఎందుకు అనుమతి ఇవ్వలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.



## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**విశ్వంభర, హనుమకొండ :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన 123 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32,40,000/ విలువైన సీఎం సహాయనిధి చెక్కులను హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందిన కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డా.భాస్కర్ రావు పనకంటికి ప్రతిష్టాత్మక శిక్షా రత్న అవార్డు




**విశ్వంభర, రామన్నపేట :** విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులకు అందించే ప్రతిష్టాత్మక శిక్షా రత్న అవార్డ్స్ 2026లో యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.భాస్కర్ రావు పనకంటికి అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ లోని కాన్హా శాంతి వనంలో ఉన్న హరి యూనివర్సిటీలో సెప్టెంబర్ 6న జరిగిన గ్రాండ్ వేడుకలో ఆయనకు ఎక్సలెన్స్ ఇన్ అకాడమిక్ లీడర్షిప్ అవార్డ్ విభాగంలో సర్టిఫికేట్ ఆఫ్ హానర్ ను ప్రదానం చేశారు. విద్యను బలోపేతం చేయడంలో, విద్యార్థులను ప్రేరేపించడంలో, మెరుగైన భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన చేసిన అంకితభావం, ఆదర్శవంతమైన కృషి, విశేష సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. హరి యూనివర్సిటీ టైటిల్ స్పాన్సర్ గా, సూపర్ ఏఐ ఫౌండేషన్, స్టడీ9 మీడియా ఆధ్వర్యంలో ఈ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. సూపర్ ఏఐ ఫౌండేషన్ ఫౌండర్ నిఖిలు గుండా, హరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.మల్లిరెడ్డి నర్సిరెడ్డి, స్టడీ9 మీడియా ఫౌండర్ భూపల్లి మహేష్‌చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా డా.భాస్కర్ రావు పనకంటిని పలువురు విద్యావేత్తలు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## ఇద్దరు పిల్లలతో కలిసి దంపతుల అదృశ్యం



**విశ్వంభర, అచ్చంపేట:** నాగర్‌కర్నూలు జిల్లాలో పిల్లలతో కలిసి దంపతులు అదృశ్యమయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన పి.ప్రభాకర్.. తన భార్య తేజ, ఇద్దరు పిల్లలతో కలిసి అచ్చంపేటలో నివాసముంటున్నారు. గతంలో ప్రభాకర్ ఆటోమొబైల్ దుకాణం నిర్వహించాడు. కొన్నాళ్ల క్రితం అది మూతపడింది. మూడు రోజులుగా ఇంటి వద్ద ప్రభాకర్, ఆయన భార్య, పిల్లలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పుల బాధతో కుటుంబం మొత్తం అదృశ్యమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## విద్యార్థుల హక్కుల సాధనకై బిజెపి మహా ధర్నా



**విశ్వంభర, కేసముద్రం :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, విద్యార్థి లోకాన్ని అడుగడుగునా దగా చేస్తోందని కేసముద్రం బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మరియు విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధనకై ఈ నెల సెప్టెంబర్ 7న (సోమవారం) భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న బిజెపి 'మహా ధర్నా' (ఛలో ఇందిరాపార్క్ )కార్యక్రమాన్ని విద్యార్థులు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు రూ.15 వేల కోట్ల ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను నిలిపివేసి, సుమారు 40 లక్షల మంది విద్యార్థుల ఉన్నత చదువుల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం కల్లలు చేసిందని విమర్శించారు. అంతేకాకుండా, ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థుల భవితను పూర్తిగా కాలరాసిందని మండిపడ్డారు.విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, అనేక సమస్యలతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చేపట్టే ఈ మహాధర్నాకు కేసముద్రం మండలం నుండి విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కోడిపందెం రాయుళ్ళపై పోలీసుల కొరడా

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** మన్నెగూడలో కోడిపందేలనిర్వహణపై ఆదిబట్ల పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీ సమీపంలోని రాజేశ్వర్ రెడ్డి పౌల్ట్రీ ఫామ్ లో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలు నిర్వహిస్తున్నారని పక్క సమాచారం మేరకు ఆదిబట్ల పోలీసులు మెరుపు దాడి చేసి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పోలీసులను చూసి అక్కడి నుంచి పరారైయ్యారు. ఆదిబట్ల సీఐ రమేష్ కథనం ప్రకారం ఈ నెల 5న సాయంత్రం 6 గంటల సమయంలో ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడ రాజేశ్వర్ రెడ్డి పౌల్ట్రీ ఫామ్ లో కోళ్ల కాళ్లకు పదునైన కత్తులు కట్టి కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఏసీపీ నుంచి సెర్చ్ అనుమతి తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందంగా అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకోగానే పలువురు పందెంరాయుళ్లు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో కోడిపందాలతో పాటు డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట నిర్వహిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల దాడిలో 31 కోళ్లు, రూ.3,60,510 నగదు, 19 స్మార్ట్ ఫోన్లు, 146 కోడిపందేల కత్తులు, 17 సెట్ల ప్లేయింగ్ కార్డులు, ఒక స్కోర్ నోట్ బుక్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక ఎర్టిగా కారు, ఒక ఆడి కారు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 719/2026 కింద తెలంగాణ గేమింగ్ చట్టం, జంతువులపై క్రూరత్వం నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో రామ కృష్ణ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో నీలం ప్రశాంత్ కుమార్, నర్ల శివశంకర్, హరివెళ్ల సత్యనారాయణ, సరణు రాఘవేంద్రరావు, అవాల వెంకన్న, పుసపాటి సీతారామరాజు, మడపం హేమనాగేంద్ర అలియాస్ చింటూ తదితరులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

